## దూరదర్శన్‌లో బీఆర్ఎస్ 'వాణి'

**ఆకాశవాణిలోనూ ఎమ్మెల్సీ వాణీదేవి ఎన్నికల ప్రచారం**

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆకాశవాణి, దూరదర్శన్‌లో బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్సీ వాణీదేవి తన వాణిని వినిపించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆమె వివరించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఎన్నికల కమిషన్ ఆకాశావాణి, దూరదర్శన్‌లో ఉచితంగా స్లాట్లను కేటాయిస్తుంది. దీనిలో భాగంగా బీఆర్ఎస్ తరఫున ఆమెకు ప్రసంగించే అవకాశాన్ని కల్పించారు. పరిశ్రమలు, పల్లెప్రగతి, పట్టణ ప్రగతి, నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా విజయాలను ఆమె వివరించారు. రాష్ట్రానికి టీఎస్ఐపాస్ విధానం ప్రపంచంలో గుర్తింపు పొందిందని తెలిపారు. తెలంగాణ వాణిని పార్లమెంట్‌లో వినిపించాలంటే బీఆర్ఎస్ ప్రతినిధులు అధిక సంఖ్యలో ఉండాలని ఆమె కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుకే ఓటు వేయాలని వాణీదేవి ఈ సందర్భంగా కోరారు.

## ఏపీ కొత్త డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా



హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి శంఖబ్రత బాగ్చి ప్రస్తుత డీజీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించిన కొన్ని గంటల్లోనే.. కేంద్ర ఎన్నికల సంఘం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ కొత్త డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తాను నియమించింది. ప్రస్తుతం హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న హరీశ్‌కుమార్‌గుప్తా 1992 క్యాడర్ ఐపీఎస్ అధికారి. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ విపక్షాల ఫిర్యాదులమేరకు.. ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని బదిలీ చేస్తూ ఎన్నికల సంఘం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. డీజీపీ పోస్టు కోసం ముగ్గురు డీజీ ర్యాంక్ అధికారుల జాబితాను పంపించాలని ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు సీఎస్ జాబితా పంపారు. సీనియార్టీ జాబితాలో ఉన్న ఐపీఎస్ అధికారులు ద్వారకా తిరుమలరావు (ఆర్టీసీ ఎండీ ), మాదిరెడ్డి ప్రతాప్, హరీశ్‌కుమార్‌గుప్తా పేర్లను సిఫార్సు చేయగా హరీశ్ కుమార్‌గుప్తాను ఈసీ ఎంపిక చేసింది.

# అదానీ, అంబానీలకు 14.50 లక్షల కోట్లు మాఫీ..

# తప్పుని నిరూపిస్తే రాజీనామా

- కిషన్‌రెడ్డి, సంజయ్‌కు కేటీఆర్ సవాల్
- నమో అంటే నమ్మించి మోసం చేయటమే
- కాంగ్రెస్ పనైపోయింది..పోటీ బీజేపీతోనే



శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ ఆర్టీఏ ఆఫీస్ వద్ద కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు

సిరిసిల్ల టౌన్/రాజన్న సిరిసిల్ల/ హైదరాబాద్ సిటీబ్యూరో, మే 6 (నమస్తే తెలంగాణ): అదానీ, అంబానీలకు నరేంద్రమోదీ రూ.14.50 లక్షల కోట్లు రుణమాఫీ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇది తప్పని రుజువు చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ బండిసంజయ్‌కు సవాల్ విసిరారు. సోమవారం కరీంనగర్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా సిరిసిల్ల నియోజకవర్గంలో,చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతుగా శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగుల్లో కేటీఆర్ ప్రసంగించారు. 'అదానీ, అంబానీలకు మోదీ రుణమాఫీ చేయలేదని నిరూపిస్తే సిరిసిల్ల తెలంగాణ విగ్రహం వద్ద నా రాజీనామా పత్రం పెట్టి, ఎమ్మెల్యే పదవి ముఖానకొట్టి బయటకు వెళ్లిపోతా' అని స్పష్టం చేశారు. ముడిచమురు ధరలు తగ్గినా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించలేదని, జాతీయ రహదారులపై టోల్ ట్యాక్స్‌లు పెట్టి రూ.30 లక్షల కోట్ల పేదల రక్తం పీల్చారని విమర్శించారు. కాకులను కొట్టి గద్దలకు ఇచ్చినట్టు పెద్దలకిచ్చినోడు నరేంద్రమోదీ అని మండిపడ్డారు. గుజరాత్‌కు వరదలొస్తే రూ.వెయ్యి కోట్లు ఇచ్చిన మోదీ.. హైదరాబాద్‌కు పైసా కూడా ఇవ్వలేదని, మనపై సవతిప్రేమ చూపిస్తున్న మోదీ రాజధర్మం ఇదేనా? అని నిలదీశారు. నిరుద్యోగం, ధరలపై మాట్లాడే ముఖం లేక.. దేవుడి పేరుతో డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు.

### రైతులు రగిలిపోతున్నరు

'ఈ ఎన్నికల్లో పోటీ కాంగ్రెస్‌తో లేదు. ఆ పార్టీ చేసిన మోసం అందరికీ అర్థమైంది. రైతులు కూడా రగిలిపోతున్నారు. ఇక బీజేపీ చేస్తున్న మోసాలను అర్థం చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉన్నది' అని కేటీఆర్ అన్నారు. నమో అంటే నరేంద్రమోదీ కాదని, నమ్మించి మోసం చేయడమేనని, రాముడి పేరుతో రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎంపీగా గెలిచి ఐదేండ్లవుతున్నా బండి సంజయ్‌ను చూశారా? అని అడిగితే లేదంటూ ప్రజలు సమాధానం చెప్పారు.

### అన్నమో రామచంద్రా! అన్న పరిస్థితి

కేసీఆర్ ప్రభుత్వం పోయాక రాష్ట్రంలో అన్నమో రామచంద్రా! అన్న పరిస్థితి వచ్చిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. 'మోచేతికి బెల్లం పెట్టి మోసపూరిత హామీలతో కాంగ్రెస్ గెలిచింది. ఆరు గ్యారెంటీల్లో ఒక్కటే అమలుచేసి రేవంత్‌రెడ్డి మొగోళ్లకు, ఆడోళ్లకు తాకులాటలు పెట్టిండు. వంద రోజుల్లో రైతు రుణమాఫీ, రూ.4 వేల పింఛన్లు వచ్చాయా? ఓటు వేసుకునేటపుడు ఒక లెక్క.. గెలిచినంక ఒకతీరులా ప్రభుత్వ పాలన ఉన్నది' అని కాంగ్రెస్ సర్కారుపై ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా 250 మంది రైతులు, 50 మంది ఆటోడ్రైవర్లు, నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని దుయ్యబట్టారు. ఉచితబస్సు ప్రయాణం తప్ప, తులం బంగారం, స్కూటీలు, రూ.2 లక్షల రుణమాఫీ ఇవ్వలేదని కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరిగారు. 420 హామీలిచ్చి 5 గ్యారెంటీలు కూడా అమలు చేయలేదని గుర్తుచేశారు. సిరిసిల్లకు వచ్చిన రేవంత్‌రెడ్డి నేతన్నలు, రైతులకు వరాలు ఇస్తారనుకుంటే.. తనను, కేసీఆర్‌ను తిట్టడానికే సమయం వెచ్చించారని మండిపడ్డారు. మోసపోయి గోసపడుతున్నామని, కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు అనుకుంటున్నారని చెప్పారు. భవిష్యత్ మనదేనని కార్యకర్తలకు భరోసానిచ్చారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన కొంతమంది విమర్శలు చేస్తున్నారని, తమ ప్రభుత్వం వచ్చాక మిత్తితో సహా రుణం తీర్చుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్‌ను కేంద్రపాలితప్రాంతం చేస్తామని, సిరిసిల్ల జిల్లాను రద్దు చేస్తామంటున్న వారికి బుద్ధి చెప్పాలని కోరారు.

> **పదేండ్ల బీఆర్ఎస్.. నిజం, పదేండ్ల బీజేపీ.. విషం, 150 రోజుల కాంగ్రెస్.. మోసం.** – కేటీఆర్


### మోదీ లైన్‌లో రేవంత్

తెలంగాణను ఓ ఆర్ఎస్ఎస్ వ్యక్తి నడుపుతున్నారని సీఎం రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు సంధించారు. 'సీఎం రేవంత్‌రెడ్డి రాహుల్‌గాంధీ లైన్‌లో లేడు. మోదీ లైన్‌లో ఉన్నాడు' అని కేటీఆర్ విమర్శించారు. కొత్త కంపెనీలను తీసుకొచ్చే ముఖం లేదని, కాంగ్రెస్ సర్కార్ అసమర్థత వల్ల గుజరాత్, చెన్నైకి కంపెనీలు తరలిపోతున్నాయని వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 16 సీట్లు ఇచ్చిన హైదరాబాద్‌కు రుణపడి ఉంటానని, ఈ ఎన్నికల్లో 10-12 సీట్లను బీఆర్ఎస్‌కు అప్పగిస్తే ఆరు నెలల్లో రాష్ట్ర రాజకీయాలను కేసీఆర్ శాసిస్తారని అన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు అరికపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, సబితాఇంద్రారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కార్తీక్‌రెడ్డి, స్వామిగౌడ్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిషత్తు మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణాధ్యాక్షుడు జిందం చక్రపాణీ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, గజభీంకార్ రాజన్న, బొంపెల్లి సురేందర్‌రావు, కల్వకుంట్ల గోపాల్‌రావు, జనగామ శరత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## శంకర్‌గౌడ్‌కు కేటీఆర్ పరామర్శ

రామగిరి, మే 6: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్‌పై కాంగ్రెస్ నాయకుల దాడులు అవివేకమని, ఒక పిరికిపంద చర్య అని కేటీఆర్ మండిపడ్డారు. ఇటీవల పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేటలో కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయాలతో బయటపడ్డ మాజీ సర్పంచ్ బుర్ర శంకర్‌గౌడ్‌ను సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయానికి పిలిపించుకొని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. శంకర్‌గౌడ్‌ను రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక కాంగ్రెస్ నేతలు దాడులకు తెగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలో ఉండగా ప్రత్యర్థులపై ఇలా దాడులకు పాల్పడలేదని గుర్తుచేశారు. శంకర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రచారంలో బిజీగా ఉన్నా, కేటీఆర్ తనను హైదరాబాద్‌కు పిలిపించి ధైర్యం చెప్పటం భరోసానిచ్చిందని వెల్లడించారు.

### లోకం పోకడ




ఫ్రీ బస్సులు రద్దు చేస్తే అవమానం.. ఇలా అరేంజ్ చేద్దాం సార్!

### ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 46.5°c | 23.3°c |
| మహబూబ్‌నగర్ | 45.7°c | 32.1°c |
| మెదక్ | 45.5°c | 24.2°c |
| రంగారెడ్డి | 44.6°c | 22.5°c |
| నిజామాబాద్ | 44.4°c | 28.9°c |
| ఖమ్మం | 44.0°c | 26.0°c |
| వరంగల్ | 42.0°c | 28.0°c |
| కరీంనగర్ | 42.0°c | 29.0°c |
| హైదరాబాద్ | 41.9°c | 28.1°c |
| నల్లగొండ | 41.0°c | 24.0°c |

## హైదరాబాద్‌లో అర్బన్ హీట్ ఐలాండ్స్

- ఏడు ప్రాంతాల్లో గుర్తించిన పరిశోధకులు
- చెట్ల నరికివేత, పొల్యూషన్ ప్రధాన కారణం

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో గత కొన్నిరోజులుగా భానుడు ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తుండటంతో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ నెల తొలి వారంలోనే 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లోనూ సూర్యుడు సుర్రుమంటుడటంతో వేడికి తాళలేక జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల తర్వాత ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. మధ్యాహ్నం 12 తర్వాత రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. గతంలో తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైన హైదరాబాద్‌లో క్రమంగా 'హీట్ ఐలాండ్స్' పుట్టుకొస్తున్నాయి. 'హైదరాబాద్ అర్బన్ ల్యాబ్స్' అనే స్వచ్ఛంద సంస్థ జరిపిన పరిశోధనలో ఇవి బయటపడ్డాయి. ఈ సంస్థకు చెందిన పరిశోధకులు శబరినాథ్, మేఘన ఈ ఏడాది మార్చిలో నమోదైన ఉష్ణోగ్రతలను లెక్కించి హీట్‌ఇండెక్స్‌ను రూపొందించారు. ల్యాండ్ సర్ఫేస్ టెంపరేచర్లను (భూమి ఉపరితలంపై 2-3 మీటర్ల ఎత్తులో నమోదయ్యే ఉష్ణోగ్రతలను) లెక్కించడం ద్వారా అర్బన్ హీట్ ఐలాండ్స్‌ను గుర్తించారు. ల్యాండ్ శాట్ శాటిలైట్ డాటా ఆధారంగా ఉష్ణోగ్రతలను లెక్కించి, వేడిమి అధికంగా ఉన్న 7 ప్రాంతాలను గూగుల్ ఎర్త్ ఇంజిన్ ద్వారా మార్క్ చేశారు. మైలార్‌దేవ్‌పల్లి, బీఎన్‌రెడ్డి నగర్, మన్సూరాబాద్, పటాన్‌చెరు, బండ్లగూడ, గచ్చిబౌలి, హయత్‌నగర్ ప్రాంతాలు హీట్ ఐలాండ్స్‌గా మారినట్టు గుర్తించారు. ఆ ప్రాంతాల్లో ల్యాండ్ సర్ఫేస్ టెంపరేచర్లు 48 నుంచి 49 సెల్సియస్ డిగ్రీల మేరకు నమోదవుతున్నట్టు వెల్లడించారు. వాతావరణ కాలుష్యంతోపాటు కాంక్రీట్ నిర్మాణాలు పెరగడం, చెట్లను నరికివేయడం ఇందుకు ప్రధాన కారణమని తేల్చారు. ఇండ్లలో వాడుతున్న ఏసీలు, ఫ్రిజ్‌ల వల్ల కూడా సర్ఫేస్ టెంపరేచర్లు పెరిగి హీట్ ఐలాండ్స్ పుట్టుకొస్తున్నట్టు తెలిపారు.

### • నాలుగు వేలు ఇస్తలేరు పటేలా



'చేతు గుర్తు అత్తే నాలుగు వేల పించిన్ ఇత్తమన్నారు.. నాల్గు నెల్లు అయినా పింఛన్ రాలేదు పటేలా?' అని వృద్ధులు మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డితో మొర పెట్టుకున్నారు. బీఆర్ఎస్ జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా కామారెడ్డి జిల్లా బాన్సువాడలో సోమవారం ఆయన ప్రచారం నిర్వహించారు. మరోసారి మోసం జరగొద్దంటే వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని మాజీ స్పీకర్ వృద్ధులకు సూచించగా, సరే పటేలా? అని బదులిచ్చారు. – బాన్సువాడ టౌన్, మే 6

### • పాడె మోసి..సానుభూతి తెలిపి



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూరులో బీఆర్ఎస్ కార్యకర్త మృతి చెందగా, మంత్రి ఎర్రబెల్లి సోమవారం పాడె మోసి సానుభూతి తెలిపారు. గ్రామానికి చెందిన ఈదునూరి వీరయ్య కుమారుడు సందీప్ (26) రోడ్డు ప్రమాదంలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందగా దయాకర్‌రావు నివాళులర్పించారు. అనంతరం పాడె మోసి కన్నీటి పర్యంతమైన మాజీ మంత్రి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. – తొర్రూరు, మే 6

# ఐదెకరాలతో ఆగేది.. అందరికీ పడ్డది

మొదటిపేజీ తరువాయి...

జమకాకపోవడంపై కేసీఆర్ పదే పదే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. యావత్ తెలంగాణ సమాజం కేసీఆర్‌కు మద్దతుగా స్పందించింది. తద్వారా రైతుబంధు ఇవ్వక తప్పని అనివార్య పరిస్థితిని కేసీఆర్ కల్పించారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ సర్కారు రైతుబంధు నిధులను విడుదల చేసింది. ఇప్పటికే ఐదెకరాల వరకు రైతుబంధు విడుదల చేసిన ప్రభుత్వం, సోమవారం ఐదెకరాలకుపైగా భూమి గల రైతుల ఖాతాల్లో సైతం జమచేసింది. వాస్తవానికి, యాసంగి సీజన్‌కు మొత్తం 1.52 కోట్ల ఎకరాలకుగాను రూ.7,625 కోట్లు విడుదల చేయాల్సి ఉన్నది. ఇందులో ఐదెకరాల రైతులకు రూ.5,202 కోట్లు ఇప్పటికే అందజేసిన ప్రభుత్వం.. తాజాగా ఐదెకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న మిగిలిన రైతులకు రూ.2,423 కోట్లను విడుదల చేసింది. ఈ విధంగా సుమారు ఐదు నెలలపాటు కొనసాగిన యాసంగి రైతుబంధు పంపిణీ ఎట్టకేలకు పూర్తయింది.


### కేసీఆర్ ప్రశ్నల పరంపర.. భయంలో సర్కారు

ఈ యాసంగి సీజన్‌లో ఐదెకరాల వరకే రైతుబంధు వేసి ఆపేయాలని ప్రభుత్వం తొలుత భావించినట్టు తెలిసింది. అందుకే ఐదెకరాలు పైబడిన రైతులకు జమ చేయకుండా ఆలస్యం చేసిందనే విమర్శలు వ్యక్తమయ్యాయి. కానీ, ప్రభుత్వం కుట్రలకు కేసీఆర్ చెక్ పెట్టారు. రైతులకు పెట్టుబడి కష్టాలు రావొద్దనే ఉద్దేశంతో తాను ప్రవేశపెట్టిన రైతుబంధు సాయం పంపిణీ ఆలస్యం కావడంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వం సాగుకు ముందే అందరికీ రైతుబంధు అందిస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతుబంధు ఎందుకు ఇవ్వడం లేదని ప్రతి సభలోనూ ప్రశ్నించారు. రైతుబంధు ఇచ్చేవరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని హెచ్చరించారు. ఒకవైపు కేసీఆర్ ప్రశ్నల పరంపర, మరోవైపు ప్రజల నుంచి వస్తున్న స్పందనతో ప్రభుత్వం ఇరకాటంలో పడింది. ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సిన వస్తుందన్న భయం అధికార కాంగ్రెస్ పార్టీలో మొదలైంది. కేసీఆర్ ప్రశ్నలతో తమకు నష్టం జరుగుతున్నదని గ్రహించిన సీఎం రేవంత్‌రెడ్డి నష్ట నివారణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే ఈ నెల 8లోగా ప్రతి రైతుకూ రైతుబంధు జమ చేస్తామని తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆగమేఘాలపై అప్పు చేసి మరీ రైతుబంధు అందించడం గమనార్హం. నిధులు విడుదల చేయకపోతే ప్రజావిశ్వాసం కోల్పోతామన్న ఆందోళనతోనే ఈ చర్యకు ఉపక్రమించినట్టు తెలిసింది.

### నాడు అడ్డుపడ్డ కాంగ్రెస్.. నేడు అడ్డుచెప్పని బీఆర్ఎస్

రైతుల పట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల వైఖరి ఏమిటనేది రైతుబంధుతో తేటతెల్లమైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ రైతుల సంక్షేమాన్ని కూడా రాజకీయం చేస్తే, బీఆర్ఎస్ మాత్రం రాజకీయం కన్నా రైతుల సంక్షేమమే ముఖ్యమని ఆచరణలో రుజువు చేసుకున్నది. ఈ రెండు పార్టీల వైఖరికి ఈ యాసంగి సీజన్ రైతుబంధు పంపిణీనే ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది. రైతులకు యాసంగి సీజన్ రైతుబంధు సకాలంలో అందాలన్న ఉద్దేశంతో అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే రైతుబంధు పంపిణీకి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకొని, నిధులు సిద్ధం చేయగా, నాడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల ముందు ఏ విధంగా రైతుబంధు ఇస్తారంటూ ఆనాడు ప్రశ్నించిన కాంగ్రెస్.. రైతులకు నోటికాడి ముద్దను దూరం చేసింది. తాము అధికారంలోకి రాగానే కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చే రూ.ఐదు వేలకు, రైతు భరోసా కింద మరో రూ.ఐదు వేలు జోడించి ఇస్తామంటూ నమ్మబలికింది. తీరా అధికారంలోకి వచ్చాక మాట తప్పింది. ఈ సారికి గత ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధునే ఇస్తామని ప్రకటించింది. వాస్తవానికి, డిసెంబర్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన మరుక్షణమే రైతుబంధును అందరి ఖాతాల్లో జమ చేసే అవకాశం ఉన్నప్పటికీ, జాప్యం చేస్తూ వచ్చింది. చివరకు పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు కొద్ది రోజుల ముందు నిధులు విడుదల చేసింది. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రవర్తించిన విధంగా నేడు బీఆర్ఎస్ వ్యవహరించలేదు. రైతుల సంక్షేమమే పరమావధిగా విశాల దృక్పథం ప్రదర్శించింది. రైతుబంధు పంపిణీపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయకుండా నిండు మనసు చాటుకున్నది. సమయం ఏదైనా సరే, రైతులకు పెట్టుబడి సాయం అందితే చాలని భావించిన బీఆర్ఎస్ పార్టీ రైతుబంధు పంపిణీకి పూర్తి మద్దతు ప్రకటించింది. ఇందుకు సంబంధించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు తాము రైతుబంధును అడ్డుకోబోమని స్పష్టంచేశారు. అందుకుతగ్గట్టుగానే సోమవారం రైతుబంధు పంపిణీకి బీఆర్ఎస్ పార్టీ ఏవిధమైన ఆటంకాలు సృష్టించలేదు. ఈ విధంగా రైతుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ రాజకీయం చేస్తే.. బీఆర్ఎస్ మాత్రం రాజకీయాలకు అతీతంగా మానవీయంగా వ్యవహరించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## హైదరాబాదీ ఫొటోగ్రాఫర్ హరికి అరుదైన గౌరవం



హైదరాబాదీ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ హరి కే పాటిబండకు అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ పోటీల్లో అరుదైన 100 ఉత్తమ ఛాయ చిత్రాల్లో హరి తీసిన మచ్చల గుడ్లగూబను వేధిస్తున్న మంగళి పిట్ట (నల్లడ్రోంగో) ఫొటో ఎంపికైంది. 2015 నుంచి 35 ఫొటో.ప్రొ సంస్థ ద్వారా ప్రతి సంవత్సరం అంతర్జాతీయ ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీలకు విశ్వవ్యాప్తంగా 1.11 లక్షల మంది ఫొటోగ్రాఫర్ల నుంచి 1.15 లక్షల ఫొటోలు వచ్చాయి. ఈ పోటీలకు హరి 9 ఫొటోలు పంపించగా, అన్ని ఫొటోలు రెండో రౌండ్‌కు ఎంపికయ్యాయి. 35 అవార్డ్స్ ఈ ఫొటోగ్రాఫ్‌ల ర్యాంకులను ఈ నెల 11 అధికారికంగా ప్రకటించనున్నది. –హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ)

## మోదీ క్యాబినెట్‌లో అందరూ 'యెస్' అంటూ తలూపేవాళ్లే!

- గడ్కరీ, రాజ్‌నాథ్ ఇద్దరే మినహాయింపు
- బీజేపీ నేత సుబ్రమణ్య స్వామి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 6: లోక్‌సభ ఎన్నికలు కీలక దశకు చేరుకున్న వేళ మోదీ సర్కార్‌పై బీజేపీ నాయకుడు సుబ్రమణ్య స్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు. మోదీ క్యాబినెట్‌లో ఇద్దరు (రాజ్‌నాథ్, గడ్కరీ) తప్ప.. మిగతా వారంతా 'యెస్' అంటూ తలూపేవారేనని విమర్శించారు. లఢక్‌లో నెలకొన్న పరిస్థితిపై కేంద్రం నిజాయితీగా లేదన్నారు. ఎన్నికల బాండ్ల పథకం అతిపెద్ద కుంభకోణమని, దీని నుంచి ప్రధాని మోదీ తప్పించుకోలేరని ఆయన అన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సుబ్రమణ్య స్వామి పై వ్యాఖ్యలు చేశారు. మోదీ సర్కార్ క్యాబినెట్ మంత్రులపై మాట్లాడుతూ, 'వారికి మంత్రులు అయ్యే అర్హతల్లేవు. రాజ్‌నాథ్, గడ్కరీ తప్ప, క్యాబినెట్‌లో మిగతావారంతా వెన్నెముక లేనివారే. అలాంటి వారినే మోదీ ఎంచుకున్నారు' అని స్వామి అన్నారు.

## బీజేపీ, కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలి

- బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం
- టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

హనుమకొండ, మే 6: మనువాద బీజేపీ, కపటప్రేమ కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఇల్లందుల రాజేశ్‌ఖన్నా అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాణాలకు తెగించి కొట్లాడి తెలంగాణ సాధించిన బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు మాత్రమే తెలంగాణ అభివృద్ధి, పేద ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉన్నదని చెప్పారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం, సచివాలయం, అమరవీరుల స్మారక చిహ్నంతో పాటు పాడిపంటలతో సుభిక్షంగా ఉన్న తెలంగాణ కేసీఆర్ అభివృద్ధి చిహ్నాలని గుర్తుచేశారు. అట్లాంటి తెలంగాణ 5 నెలల కాంగ్రెస్ పాలనలో ఆగమవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క నిమిషం కూడా కరెంటు పోని రాష్ట్రాన్ని కరెంటు కోతల రాష్ట్రం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ అసెంబ్లీలో అఖిలపక్షాన్ని ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపడంతో పాటు బిల్లు పెట్టాలని ప్రధాన మంత్రి వద్దకు బృందాన్ని పంపినట్టు గుర్తుచేశారు. కేసీఆర్‌తోనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని సంపూర్ణంగా విశ్వసిస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మారెపల్లి సుధీర్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ఈదునూరి యాకన్న, యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొట్టపెంజర రమేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెడ స్వామి, రాష్ట్ర నాయకుడు బొచ్చు మురళి, ఎంఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా, కేయూ ఇన్‌చార్జి ధర్మారపు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## పంట నష్టపరిహారం 15.8 కోట్లు

- పరిపాలనా అనుమతులు మంజూరు
- విపత్తు నిర్వహణ శాఖ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారాన్ని విడుదల చేసింది. 10 జిల్లాల్లోని 15,246 మంది రైతులకు రూ.15.8 కోట్లు కేటాయిస్తూ విపత్తు నిర్వహణ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది మార్చి 16 నుంచి 21 తేదీల మధ్య ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురిశాయి. 15,814 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు ప్రభుత్వానికి నివేదిక అందగా..ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం అందించనున్నారు. ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి వచ్చిన నేపథ్యంలో నిధులను కేటాయిస్తూ తాజాగా విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. నిధులు విడుదలైన నుంచి 90 రోజుల్లోగా రైతుల ఖాతాలో జమ చేయనున్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ కమిషనర్‌కు సూచించారు.

# సుప్రీంకోర్టుకు హేమంత్ సోరేన్

న్యూఢిల్లీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. భూ కుంభకోణం కేసులో మనీలాండరింగ్ జరిగినట్లు ఆరోపిస్తూ ఆయనను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జనవరి 31న అరెస్ట్ చేసింది. ఈ అరెస్టును సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను జార్ఖండ్ హైకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. దీనిపై ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో అప్పీలు చేశారు. హేమంత్ ప్రస్తుతం రాంచీలోని బిర్సా ముండా కేంద్ర కారాగారంలో జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు.